నేటి పత్రిక
# ప్రజావార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ: 24 - 31 మే 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 50 | పేజీలు : 4, వెల: రూ.5

## జీఎస్ఎల్వీ-ఎఫ్12 ప్రయోగం విజయవంతం



**శ్రీహరికోట, నేటి పత్రిక ప్రజావార్త :**
జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. తిరుపతిలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ప్రయోగించిన ఈ వాహకనౌక.. ఎన్వీఎస్-01 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. రాకెట్ బయలుదేరిన తర్వాత 18 నిమిషాలకు ఉపగ్రహాన్ని 251 కి.మీ. ఎత్తులో జియోసింక్రోనస్ ట్రాన్స్ఫర్ ఆర్బిట్లో ప్రవేశట్టింది. భారతదేశానికి చెందిన రెండో తరం నావిక్ ఉపగ్రహాల్లో ఎన్వీఎస్-01 మొదటిది. 2,232 కిలోల బరువున్న దీని జీవితకాలం 12 ఏళ్లు. ఈ ఉపగ్రహం భారత్ ప్రధాన భూభాగం చుట్టూ సుమారు 1500 కి.మీ పరిధిలో రియల్ టైమ్ పొజిషనింగ్ సేవలను అందిస్తుంది.

# చిరకాల స్వప్నం..బందరు పోర్టు పూర్తి చేస్తాం

### బందరు పోర్టుకు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.5,156 కోట్ల వ్యయంతో చేపట్టిన బందరు పోర్టు నిర్మాణానికి సోమవారం కృష్ణా జిల్లా మంగినపూడి సమీపంలోని తపసిపూడి వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో నిర్వహించిన సభలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ చిరకాల స్వప్నం బందరు పోర్టును అన్ని అనుమతులు సాధించి ఫైనాన్షియల్ క్లోజర్ను పూర్తి చేసి టెండర్ల ప్రక్రియను ముగించి పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించాం. దాదాపు 35 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పోర్టు ప్రారంభమవుతుంది. నాలుగు బెర్తులు ఇక్కడ రానున్నాయి. ట్రాఫిక్ పెరిగే కొద్దీ బెర్తుల సంఖ్యను పెంచుకుంటూ 116 మిలియన్ టన్నుల కెపాసిటీ వరకు విస్తరించుకోవచ్చున్నారు. ఈనెల 26వతేదీన అమరావతిలో 50 వేల మందికి పైగా పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. బందరు పోర్టు నిర్మాణంతో పాటు అనుబంధంగా మౌలిక వసతుల పనులు కూడా చేపడుతున్నాం. కేవలం 6.5 కి.మీ. దూరంలో ఉన్న 216వ నెంబర్ జాతీయ రహదారిని పోర్టు వరకు అనుసంధానించేలా చర్యలు చేపట్టాం. దీంతోపాటు 7.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడివాడ, మచిలీపట్నం రైల్వే లైనును కూడా పోర్టు వరకు తీసుకొచ్చి అనుసంధానిస్తున్నాం. బందరు కాలువ నుంచి 0.5 ఎం.ఎల్.డీ నీటిని 11 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా తరలించి పోర్టుతో అనుసంధానం చేస్తున్నాం. బందరు పోర్టు రాకూడదని చంద్రబాబు అడుగులు వేశారన్నారు. ఈరోజు పోర్టు నిర్మాణానికి 1,700 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాం. రైలు, రోడ్డు మార్గానికి కేవలం మరో 240 ఎకరాలు మాత్రమే భూసేకరణ జరిగింది. రైతులందరూ మనస్ఫూర్తిగా ఇచ్చిన 240 ఎకరాలు తీసుకుని పోర్టు నిర్మాణంలోకి వస్తుంది. ఇక్కడ ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయి. వాటిలో 4 వేల ఎకరాలను పోర్టుతో అనుసంధానించి పరిశ్రమలు వచ్చేలా చేయడం ద్వారా లక్షలాది ఉద్యోగాలకు ఊతం పడినట్లు అవుతుంది. మరో 24 నెలల వ్యవధిలో ఈ ప్రాంతం రూపురేఖలు మారబోతున్నాయి. మరో నాలుగు నెలల్లో ఈ ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి వస్తుంది. ఇక్కడే ఇమిటేషన్ జ్యూయలరీ తయారీకి మద్దతుగా కరెంటు ఛార్జీలను తగ్గిస్తామని నా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.7.65 నుంచి మనం అధికారంలోకి రాగానే రూ.3.75లకు తగ్గించాం. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టాం. ఆరు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల పనులూ వేగంగా జరుగుతున్నాయి. పేదరికాన్ని సమూలంగా తొలగించి నా అక్కచెల్లెమ్మల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు రూ.2.10 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేశాం. మెడికల్ కాలేజీ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి కోసం రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నాం. 6 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నాం. అంబేద్కర్ భవన్ మరమ్మతులకు రూ.5 కోట్లు కేటాయిస్తున్నాం. అమరావతి ప్రాంతంలో 50 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితమే ప్రారంభించాం. కానీ దేవతల యజ్ఞాన్ని రాక్షసులు అడ్డుకున్నట్టుగా ఓ ముఠా అడ్డుపడుతుందన్నారు.

అమరావతి పరిధిలో మీ బిడ్డ ప్రతి పేదవాడికి 1.1 సెంటు భూమిని ఉచితంగా ఇచ్చి ఇల్లు కూడా ఉచితంగా కట్టిస్తూ 50 వేల మంది కలలను నిజం చేస్తుంటే ఆ పవిత్ర స్థలాన్ని చంద్రబాబు స్మశానంతో పోలుస్తాడా అని ప్రశ్నించారు. మీ బిడ్డ పాలనలో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు తోడుగా మీరే సైనికులుగా నిలవండి అని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా పార్లమెంటు ప్రారంభోత్సవ ం..



**ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**
ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పార్లమెంటు నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది.. తొలుత లోక్సభ స్పీకర్ ఓంబిర్లాతో కలిసి పార్లమెంటులోని మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులు అర్పించారు. అనంతరం నూతన పార్లమెంటు భవనం వద్దకు చేరుకున్న ప్రధానికి శృంగేరీ పీఠాధిపతులు కలశంతో స్వాగతం పలికారు. అప్పటికే రాజదండానికి (సెంగోల్)కు పూజలు నిర్వహించగా మోదీ దానికి సాష్టాంగ ప్రమాణం చేశారు. అనంతరం అధీనం మఠాధిపతులు దానిని ప్రధానికి అందజేశారు. రాజదండాన్ని తీసుకెళ్లి లోక్సభలోని స్పీకర్ కుర్చీ వద్ద ప్రతిష్ఠించిన మోదీ.. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మఠాధిపతుల నుంచి ఆశీర్వాదాలు అందుకున్నారు.
అంతకుముందు జరిగిన సర్వమత ప్రార్థనల్లో స్పీకర్ ఓం బిర్లా, కేబినెట్ మంత్రులతో కలిసి మోదీ పాల్గొన్నారు. పార్లమెంటు భవన నిర్మాణంలో పాలు పంచుకున్న కార్మికులను మోదీ సన్మానించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించి కొత్త పార్లమెంటు భవనాన్ని జాతికి అంకితం చేశారు. కాగా, కొత్త పార్లమెంట్ ఆరంభ వేడుకలకు పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. కొత్త పార్లమెంట్ ఆరంభ వేడుకలకు ఏపి ముఖ్యమంత్రి జగన్ కూడా హాజరయ్యారు. కొత్త పార్లమెంట్ భవన నిర్మాణ కార్మికులను ప్రధాని మోదీ సన్మానించారు.



# తెలుగు భాషా పరిరక్షకులు డా.మండలి బుద్ధప్రసాద్కి, కిన్నెర..ఎన్టీఆర్ భాషా సేవా పురస్కారం




**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**
తెలుగు భాషా పరిరక్షకులు, మాజీ ఉపసభాపతి డా.మండలి బుద్ధప్రసాద్ "కిన్నెర..ఎన్టీఆర్ భాషా సేవా పురస్కారాన్ని" అందుకున్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్..నృత్య కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో శక పురుషులు, పూర్వ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ డా.ఎన్.టి.రామారావు శత జయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ పూర్వ ఉప సభాపతి డా.మండలి బుద్ధప్రసాద్కి కిన్నెర..ఎన్టీఆర్ భాషా సేవా పురస్కారాన్ని బహూకరించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డా.ఆర్.ప్రభాకరరావు, మద్దాలి రఘురామ్ ల ఆధ్వర్యంలో హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి డా.ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతులమీదుగా డా.బుద్ధప్రసాద్కి పురస్కారం అందించి ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కెవి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం, శ్రీ దెవలపర్స్ ఎండి భోగరాజు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ను కలిసిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని భారత్లో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్ బుధవారం కలిశారు. ఏపీలో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించారు. ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్దంగా ఉన్నామని సీఎం అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను సీఎం వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్, టెక్నాలజీ ట్రాన్స్ఫర్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ సస్టెయినబిలిటీ, సస్టెయినబుల్ ప్రాక్టీసెస్, ఆటోమెటివ్ అండ్ ఇంజినీరింగ్, జాయింట్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్, ఐటీ అండ్ డిజిటలైజేషన్, స్టార్టప్ ఎకో సిస్టమ్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, స్కిల్ ఎన్హాన్స్మెంట్ ప్రోగ్రామ్స్, ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ వంటి వివిధ రంగాలలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్దంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్ వివరించారు. ఏపీని ఫోకస్డ్ స్టేట్గా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, జర్మనీ రాయబార కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

# సినిమా ఆపరేటర్స్ పరీక్ష - 2023 కొరకు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

సినిమా ఆపరేటర్స్ పరీక్ష-2023 కొరకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుచున్నామని విద్యుత్ భద్రతా సంచాలకులు మరియు ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి గుంటూరు వారు ఒక ప్రకటనలో తెలియజేసారు. జూలై 2023 లో నిర్వహించే సినిమా ఆపరేటర్స్ పరీక్ష కొరకు అర్హత గల అభ్యర్థులు జూలై 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి 2022 జూన్ నాటికి ఆంధ్ర ప్రదేశ్ లోని ఏదైనా లైసెన్సుడ్ సినిమా థియేటర్ లో ఒక సంవత్సరం అప్రెంటెషిప్ ట్రైనింగ్ పూర్తి చేసి ఉండాలని, ది. 01-07-2022 నాటికీ 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయి ఉండాలని, షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు 10వ తరగతి పరీక్షలో పాస్ అయినా, ఫెయిల్ అయినా సినిమా ఆపరేటర్స్ పరీక్ష వ్రాయడానికి అర్హులని ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి గుంటూరు వారు తెలిపారు. పరీక్షా కేంద్రం విజయవాడలో ఏర్పాటు చేస్తామని, పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రూ. 600/-లు రుసుం చలానా రూపంలో జమ చేయాలన్నారు. పరీక్ష రుసుం చలానా రూపంలో ఈ క్రింది తెలిపిన విధంగా చెల్లించాలన్నారు.

Major Head 0043 TAXES AND DUTIES ON ELECTRICITY
Minor Head 103 FEES FOR ELECTRICAL INSPECTION OF CINEMAS
Sub Head 01 FEES FOR ELECTRICAL INSPECTION OF CINEMAS
D.D.O. CODE: 27000502001.

దరఖాస్తు ఫారాలు కావలిసినవారు విద్యుత్ భద్రతా సంచాలకులు మరియు ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇంటి నెం. 5-17-6, రెండవ అంతస్తు, 1/16, బ్రాడీ పేట, గుంటూరు-522002 నుండి పొందవచ్చునని, దరఖాస్తు ఫారాల కొరకు జత చేయవలసిన డాక్యుమెంట్లు ఇతర వివరాలకు విద్యుత్ భద్రతా సంచాలకులు మరియు ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి వారి నుండి వివరాలు పొందవచ్చునన్నారు.

## ఎపిలోని వివిధ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి మనదేశానికి 141.12 మిలియన్ డాలర్ల రుణ మంజూరు పై సంతకం చేసిన ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్

**ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఈనెల 23న ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) భారత ప్రభుత్వంతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు పారిశ్రామిక క్లస్టర్‌లలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, నీటి సరఫరా వ్యవస్థలు, విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ వంటి అధిక-నాణ్యత గల అంతర్గత మౌలిక సదుపాయాల అభివృద్ధికై 141.12 మిలియన్ డాలర్ల రుణంపై సంతకం చేశాయి. ఇది రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాళహస్తి-చిత్తూరులోని మూడు పారిశ్రామిక క్లస్టర్లలో మౌలిక సదుపాయాలను నిర్మించడానికి 2016లో ఆసియా అభివృద్ధి బ్యాంకు ఈ కార్యక్రమం కోసం వినియోగిస్తున్న 500 మిలియన్ డాలర్ల మల్టీ-ట్రాంచ్ ఫైనాన్సింగ్ ఫెసిలిటీ (ఎంఎఫ్ఎఫ్) కింద విడుదలయ్యే రెండవ విడత ఆర్థిక ఋణం.

ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు ఫైనాన్సింగ్ వల్ల రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో తయారీ రంగం వాటాను పెంచడానికి, పోటీతత్వాన్ని పెంపొందించడానికి, ప్రాజెక్ట్ లక్ష్య ప్రాంతాలలో ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలనూ సృష్టించడానికి పారిశ్రామికీకరణను ప్రోత్సహించే దిశలో రాష్ట్రానికి మల్టీ సెక్టోరల్ విధానాన్ని అవలంబించడం ద్వారా సహాయపడుతుంది. ఈ ఋణం వల్ల విశాఖపట్నం నోడ్‌లో 160-హెక్టార్ల రాంబిల్లి, 441-హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న నక్కపల్లి పారిశ్రామిక సమూహాలలో అంతర్గత మౌలిక సదుపాయాల అభివృద్ధితో పారిశ్రామిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఉపయోగ పడుతుంది, 13.8-కిలోమీటర్లు విస్తరించిన అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి, 4.4-కిమీ విస్తరించిన నక్కపల్లి యాక్సెస్ రోడ్డును మెరుగుపరచడం ద్వారా నక్కపల్లి క్లస్టర్‌కు లబ్ది చేకూరుతుంది. ప్రతిపాదిత క్లస్టర్లలో అంతర్గత మౌలిక సదుపాయాలుగా అంతర్గత రహదారులు, తుఫాను నీటి కాలువలు, నీటి సరఫరా వ్యవస్థలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలను కలిగి ఉంటాయి. శ్రీకాళహస్తి-చిత్తూరు నోడ్‌లో, 938 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న చిత్తూరు-దక్షిణ ఇండస్ట్రియల్ క్లస్టర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి, చిత్తూరు-దక్షిణ ఇండస్ట్రియల్ క్లస్టర్‌కు 9.5-కిమీ యాక్సెస్ రహదారిని, నాయుడుపేట ఇండస్ట్రియల్ క్లస్టర్‌లోని 8.-కిమీ యాక్సెస్ రహదారిని మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్ట్ సహాయపడుతుంది.

సామాజికంగా ఆర్థికంగా బలహీన వర్గాలతో సహా అనేక మందివ్యక్తుల నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా ఈ ప్రాజెక్టు ప్రణాళిక ఉంది. మార్కెటింగ్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంలో బ్యాంకు రాష్ట్రానికి మద్దతు ఇస్తుంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితును తట్టుకునేందుకు వీలుగా పారిశ్రామిక క్లస్టర్‌ను బలోపేతం చేయడానికి, ప్రాజెక్ట్ గ్రీన్ కారిడార్ మోడల్ కార్యాచరణ మార్గదర్శకాలను ఏర్పాటు చేయడంలో, విపత్తు ప్రమాద నిర్వహణ ప్రణాళికను అభివృద్ధి చేయడంలో ఈ ప్రాజెక్టు సహాయపడుతుంది. దీర్ఘకాలిక సుస్థిరత కోసం ఉద్దేశించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పారిశ్రామిక క్లస్టర్‌ల నిర్వహణను మెరుగుపరచడానికి ఒక మార్గదర్శక ప్రణాళికను రూపొందిస్తుంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో పారిశ్రామిక, పట్టణ ప్రణాళికలను ఏకీకృతం చేయడానికి సామాజికంగా అన్ని వర్గాలను కలుపుకొని పారిశ్రామిక సమూహాల నిర్వహణ నిమిత్తం ఆచరణ యోగ్యమైన ప్రణాళిక ఈ ప్రాజెక్టు వల్ల సాధ్యం అవుతుంది.

## గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లకు సీఎం గ్రీన్ సిగ్నల్

### -1000కిపైగా పోస్టుల భర్తీ

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

గ్రూప్-1. గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీకి సీఎం వైయస్.జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ఉదయం ముఖ్యమంత్రికి అధికారులు ఈపోస్టుల భర్తీపై వివరాలు అందించారు. సీఎం ఆదేశాల మేరకు ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకున్నామని వెల్లడించారు. నోటిఫికేషన్ జారీకి అవసరమైన కసరత్తు తుదిదశలో ఉందని తెలిపారు. గ్రూప్-1కి సంబంధించి సుమారు 100కిపైగా పోస్టులు, గ్రూప్-2కు సంబంధించి సుమారు 900కిపైగా పోస్టులు, మొత్తంగా 1000కిపైగా పోస్టులు భర్తీచేయనున్నామని తెలిపారు. వీలైనంత త్వరలో దీనికి సంబంధించి నోటిఫికేషన్ జారీచేయాలని సీఎం ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలు వెల్లడి తదితర అంశాలపైనా దృష్టిసారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## జూన్‌లో తిరుమల వెంకన్న దగ్గరకు ఎందుకు వెళ్లాలంటే..

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**

తిరుమలలో జూన్ నెలలో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. జూన్ 2న నమ్మాళ్వార్ శాత్తుమొర ఉత్సవంతో పాటు జూన్ 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ శ్రీవారి ఆలయంలో జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నారు. జూన్4వ తేదీన ఏరువాక పూర్ణిమను నిర్వహించనున్నారు. జూన్ 14వ తేదీన మతత్రయ ఏకాదశి, జూన్ 28వ తేదీన పెరియాళ్వార్ ఉత్సవారంభం ఉంది. జూన్ 29వ తేదీన శయన ఏకాదశి కావడంతో చాతుర్మాస్య వ్రతారంభం నిర్వహించనున్నారు.

## జూన్4 తేదీ న్యూయార్క్‌లో రాహుల్‌గాంధీ పర్యటనను విజయవంతం చేయండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

అమెరికాలోని న్యూజెర్సీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జూన్ 4వ తేదీ పర్యటనను విజయవంతం చేయవలసిందిగా ఎపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అమెరికాలోని ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. మే 29న సాయంత్రం న్యూజెర్సీలో జరిగిన ప్రవాస భారతీయుల సమావేశంలో రుద్రరాజు మాట్లాడుతూ భారతదేశంలో అనేక సవాళ్ళు సమస్యలు ఉన్నాయని అన్నారు. దేశ ప్రగతి పురోగతి కోసం అభివృద్ధి గురించి చర్చిండటానికి రాహుల్ గాంధీకే వినిపించటం కోసం ఈ ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 200 మంది ప్రవాస భారతీయులు హాజరైన ఈ విలేకరుల సమావేశానికి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా రుద్రరాజు అమెరికాలోని ప్రవాస భారతీయులను ఆహ్వానించారు. నిన్న జరిగిన ప్రవాస భారతీయుల సమావేశంలో ఆయనతో పాటు ఏఐసిసి సెక్రటరీ ఇన్‌చార్జ్ ఐ.ఓ.సీ. ఆర్తీ కృష్ణాజి, రాజేశ్వర్ గంగసాని, ప్రదీప్ శ్యామలా, శ్రీనివాసరావు భీమినేని, రామ్మోహన్‌రావు గాదుల, బొర్రా సుజన సాయి, పవన్ దర్శి తదితరులతో పాటు కాంగ్రెస్ పెద్దలు భారీగా పాల్గొన్నారు.

# విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన



**కొవ్వూరు, నేటి పత్రిక ప్రజావార్త :**

జనవరి-మార్చి 2023 త్రైమాసికానికి 9.95 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.703 కోట్లను తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేసారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో సీఎం వైయస్.జగన్ మాట్లాడుతూ... దాదాపుగా 9.95 లక్షల మంది పిల్లలకు వారి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు దాదాపు రూ.703 కోట్లను 8,91,180 మంది వారి తల్లుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నాం. వివక్ష, పోవాలన్నా, పేదరికం పోవాలన్నా చదువు అనేది గొప్ప అస్త్రం అన్నారు. ఈ రోజు అలాంటి చదువులు విప్లవం దిశగా మార్పులు వచ్చేటట్టుగా మన రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా అడుగులు వేశాం. చంద్రబాబు ప్రభుత్వంలో అరకొరగా ఫీజులు ఇచ్చారు. ఈ రోజు జమ చేస్తున్న రూ.703 కోట్లు కలుపుకుంటే ఈ ఒక్క జగనన్న విద్యాదీవెన పథకానికే ఏకంగా రూ.10,636 కోట్లు ఇచ్చాం. జగనన్న విద్యాదీవెన వల్ల 26.98 లక్షల మంది ప్రయోజనం పొందారు. మన పిల్లలందరికీ మంచి జరగాలని.. ఎంత ఫీజులైనా రూ.60వేలు, రూ.70 వేలు, రూ.1లక్ష, రూ.1.20 లక్షలైనా ఎంత ఫీజులైనా ఫర్వాలేదు.. మీరు చదవండి మీ జగనన్న చదవిస్తాడు. ప్రతి అక్కకూ చెబుతున్నాను మీ పిల్లలకు మంచి మేనమామగా ఎప్పుడూ తోడుగా ఉంటాను. ఎంత మంది పిల్లలుంటే అంతమందిని చదవించండి. అన్ని రకాలుగా ఆ పిల్లలకు తోడుగా ఉంటాను. పిల్లల చదువులు మీద మనం చేస్తున్న ఖర్చు భావితరాల పిల్లల తలరాతలు మార్చేందుకు మేం పెట్టే ఖర్చు.. మానవ వనరులమీద పెడుతున్న పెట్టుబడులు అని ఈ జ్ఞానం లేనివారికి చెప్తున్నాను. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో నర్సరీ నుంచి, ఉన్నత విద్యవరకూ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు నాలుగేళ్లలో అడుగులు పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. సంపూర్ణ పోషణం, రోజుకోమెనూతో గోరుముద్ద పథకాలు వీటి ద్వారా అంగన్‌వాడీల స్వరూపం కూడా మారుతోంది. విద్యాకానుక ద్వారా స్కూళ్లు తెరిచే సమయానికి కిట్లను అందిస్తున్నాం.పిల్లలకు ఇంటికి వెళ్లిన తర్వాత ట్యూటర్ ఉండాలన్న తాపత్రయంతో బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ ఇచ్చాం. జూన్ 12వ తేదీలోగా 6 నుంచి పై తరగుతులు అన్నింటికీ డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేస్తున్నాం. మనం తీసుకువస్తున్న మార్పులన్నీ సత్ఫలితాలనిస్తున్నాయి. 2018-19లో ఇంజినీరింగ్ చదివేవాళ్లు 87వేలు మంది అయితే ఈ ప్రభుత్వంలో 2022-23లో 1.20 లక్షలమంది చదువుతున్నారు. స్కిల్ ఓరియెంటెడ్‌గా మన పిల్లలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాం. జగనన్న విదేశీ దీవెన ద్వారా ప్రపంచంలోనే టాప్ 50 కాలేజీల్లో 21 ఫ్యాకల్టీలో, 350 ప్రపంచస్థాయి కాలేజీల్లో సీటు తెచ్చుకున్న పిల్లలకు రూ.1.25 కోట్ల వరకూ కూడా పూర్తిగా ఫీజులు మన ప్రభుత్వం కడుతుంది. రూ.1.25 కోట్లు ఫీజులు కట్టాల్సి వస్తే.. స్టాన్‌ఫర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్‌లో సీటు వచ్చినా ఆ ఫీజు కట్టలేక, చదువుకోలేకపోతున్నవారందికీ చెప్తున్నా... ప్రతిభ మీరు చూపించండి.. మీ ప్రతిభకు తోడుగా నేనున్నాను. నేను మీ అందరికీ చెపుతున్నాను. ఇవాళ జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు.. క్లాస్‌వార్. పేదవాడు ఒకవైపున ఉన్నాడు.. పెత్తందార్లు మరోవైపున ఉన్నారు. మర్చిపోవద్దు. రాబోయే రోజుల్లో మరిన్ని అబద్ధాలు చెప్తారు, మోసపూరిత మాటలు చెప్తారు. కానీ నేను ఒక్కటే ఒకటి మీకు చెప్తున్నాను. మీరు ఒకటే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అన్నదే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగితే.. మీజగనన్నకు తోడుగా మీరే సైనికులు కండి. నా బలం మీరు.. నా నమ్మకం మీరే. రాబోయే రోజుల్లో జరగనున్న కురుక్షేత్ర మహాసంగ్రామంలో మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు ఉండాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాలు, బీసీ సంక్షేమం, సినిమా ఆటోగ్రఫీ మంత్రి చెల్లిబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హెూం శాఖ తానేటి వనిత, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేంరాజు, ప్రభుత్వ విప్పు, చిర్ల జగ్గిరెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మెరుగు నాగార్జున, ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి.జయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు విజయ్‌కృష్ణన్, శాసనమండలి సభ్యులు పావూరు శ్రీనివాసరావు, మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి, ఎంపి మార్గాని భరత్‌రామ్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోష్, శాసనసభ్యులు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్ నాయుడు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి, వేణుగోపాలరావు, స్మార్ట్ సిటీ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎస్ మణికుమారి, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, కొవ్వూరు పురపాలక చైర్‌పర్సన్ జిల్లా కలెక్టర్ డా. కే.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కే.దినేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఆర్డీవోలు ఏ చరిత్రవర్షిని, ఎస్.మల్లిబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో సమ్మర్ క్యాంపును ప్రారంభించిన మంత్రి ఆర్.కె.రోజా

**నగరి, నేటి పత్రిక ప్రజావార్త :**



నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో సమ్మర్ క్యాంపును రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల మరియు యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొంటే సమాజంలో ఎలా బ్రతకాలో తెలుస్తుందని అన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు క్రీడాల్లో పాల్గొనడం వలన మానసిక వికాసం పెరుగుతుందని తెలిపారు. నగరిలో ఇండోర్ స్టేడియంను మంత్రి ఆర్.కె రోజా మరియు చిత్తూరు ఎస్.పి.రిశాంత్ రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. బాల్ బాడ్మింటన్, షట్టల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్ క్రీడాలలో వారు పాల్గొని క్రీడాకారులకు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సమావేశంలో నగరి నియోజకవర్గంలోని మునిసిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిల్లర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, రాష్ట్ర డైరెక్టర్‌లు, కమిటీల చైర్మన్లు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ మహాసంప్రోక్షణకు సీఎం జగన్‌కు ఆహ్వానం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి జమ్మూలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ మహాసంప్రోక్షణకు టీటీడీ ఛైర్మన్ వైవీ. సుబ్బారెడ్డి, ఎస్.వి.గ్రూప్ ఆఫ్ టెంపుల్స్, న్యూఢిల్లీ ప్రెసిడెంట్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆహ్వానించారు. జూన్ 3 నుంచి 8 వరకు జమ్మూ శ్రీవారి ఆలయంలో మహా సంప్రోక్షణ, 8న మిధున లగ్నంలో కళావాహన, ఆరాధన అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాలు.

## పశు ఆరోగ్య సేవా రథాల్లో పోస్టుల భర్తీకి చర్యలు

**రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త :**

డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాల్లో పశు వైద్యులకు, పారావేట్‌లు, డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంయుక్త సంచాలకులు, డా.యస్.టి.జి. సత్య గోవింద్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సంచార పశు సేవా రథాల మేనేజర్ రమేష్ రావును (ఫోన్: 6260624232) సంప్రదించగలరు. వెటర్నరీ వైద్యుల పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలని, కొత్తగా పట్టా పొందిన వారితో పాటు రిటైర్డ్ డాక్టర్లు కూడా అర్హులేనని తెలియజేశారు. పారావెట్ పోస్టులకు డిప్లొమా ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇక పైలట్ పోస్టులకు (డ్రైవరు) పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, హెచ్ ఏం వి లైసెన్స్‌తో కనీసం 2 లేదా 3 ఏళ్ల అనుభవం కలిగి ఉండాలని, 35 ఏళ్ల లోపు వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు రాజమండ్రి, దేవీచౌక్ దగ్గర, గోకవరం బస్‌స్టాండ్ రోడ్‌లో గల గవర్నమెంట్ వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలో గల జిల్లా పశు వైద్యాధికారి వారి కార్యాలయం వద్ద ఈ నెల 29 వ తేదీన ఉదయం 9.00 గంటలకు అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్: 6260624232.సంప్రదించ వచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## నాలుగేళ్లలో జగన్ చేసింది 9%.. ప్రభుత్వం ప్రచారం 99% : పెందుర్తి శ్రీనివాస్

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



నాలుగేళ్లలో జనరంజక పాలన చేశానని 99% శాతం హామీలు పూర్తి చేశామని వందల కోట్ల ప్రకటనలకు ఖర్చు పెట్టే వైసిపి ప్రభుత్వం 999 అబద్ధాలు చెప్పిందని 99 హామీల అమలులో వైసిపి వైఫల్యం చెందిందని ప్రజలను నమ్మించి మోసం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి విద్వేషం, విధ్వసం, విషాద పాలనకు నేటికీ 4 ఏళ్లని జగన్ పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని "భవిష్యత్‌కు భరోసా" నింపుతున్న తెలుగుదేశం వైపే అన్ని వర్గాల అన్ని రంగాల ప్రజల మద్దతని అందుకు ఇటీవల కాలంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు, కుంభమేళాను తలపించిన రాజమహేంద్రవరం మహానాడులే నిదర్శనమని అగ్నిగుడంలా ఉన్నా, ఉరుములు కుండపోత వర్షం పడినా నారా చంద్రబాబునాయుడు "భవిష్యత్‌కు భరోసా" ప్రకటన కోసం ప్రజలు స్వచ్ఛందంగా లక్షలాదిగా తరలి రావడం శుభ సూచకమని రైతు, యువత, మహిళ, త్రాగు నీరు, పేదరిక నిర్మూలనల మీద టిడిపి ప్రకటన చేసిన మొదటి దశ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజల్లోకి వేగంగా వెళ్లి హర్షం వ్యక్తం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ అన్నారు. 100 అబద్ధాలు ఆడి ఒక పెళ్లి చెయ్యటం విన్నాం కానీ అధికారం కోసం1000 అబద్ధాలు చెప్పటం తెలుగు ప్రజలు మొదటిసారిగా చూస్తున్నామని జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలు ప్రచురించాలంటే ఓ పేజీ సరిపోదని ఒక సంచిక కావాలని పెందుర్తి ఎద్దేవా చేశారు. ఈ మేరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు వెల్లంపల్లి శ్రీనివాస్ వైఫల్యం చెందిన హామీలలో 99 హామీలను పెందుర్తి శ్రీనివాస్ పత్రికా ప్రకటన విడుదల చేశారు .

# నియోజకవర్గ ప్రజా సమస్యల మీద సమావేశం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, జగన్‌మోహన్‌రెడ్డి అరాచకపాలన మీద నిరసనగా తెలుగుదేశం పార్టీ రూపకల్పన చేసిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాలతో నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు టీమ్ టీడీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు నియోజకవర్గ ప్రజా సమస్యల మీద సమావేశం, మీడియా సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎమ్ ఎస్ బేగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్యల మీద ప్రత్యేక దృష్టి సారించామని, గత 5 నెలలుగా అన్ని డివిజన్‌లలో డివిజన్ పార్టీ మరియు డివిజన్ ఎన్నికల విభాగం క్షేత్ర స్థాయిలో ప్రతి కుటుంబాన్ని కలసి వైసిపి ప్రభుత్వం ఏర్పాటు నుండి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రాంత సమస్యలు సేకరించటం జరిగిందని అన్ని సమస్యలను రాష్ట్ర పార్టీ దృష్టికి, ఎంపి కేశినేని శ్రీనివాస్(నాని) దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని, ప్రభుత్వ పరమైన అంశాల క్షేత్ర స్థాయిలో పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నామని ఎమ్ ఎస్ బేగ్ తెలిపారు,

రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఎన్నికల విభాగం కన్వీనర్ పెందుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలో క్షేత్ర స్థాయిలో డివిజన్ పార్టీ అధ్వర్యంలో ఎన్నికల విభాగం ప్రతి ఇంటికి ప్రజల వద్దకు వెళ్లి నియోజక వర్గం పరిధిలోని 47.78% అనగా 44115 కుటుంబాలను ప్రత్యక్షంగా కలసి 34142 కుటుంబాల వద్దవారి సమస్యలు, వైసిపి ప్రభుత్వం పని తీరు మీద అభిప్రాయ సేకరణ, నివాస ప్రాంతాల సమస్యలు సేకరించి డిజిటల్ విధానంలో రాష్ట్ర పార్టీకి నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం లో జరగనున్న మహానాడులో ప్రదర్శనలో ఉంచటం జరుగుతుందని, సేకరించిన సమస్యలు అన్నింటి మీద ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ద్వారా పరిష్కారం కొరకు కృషి చేస్తామన్నారు.

ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి సారిపల్లి వెంకట రాధాకృష్ణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రభుత్వ శాఖల వైఫల్యాలు, సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన టీమ్ టీడీపీ



విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సమిష్టిగా వైసిపి ప్రభుత్వం మీద పోరాటానికి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని రాధా కృష్ణ ప్రకటించారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జిలు ధనేకుల వెంకట సుబ్బారావు, బెవర సాయి సుధాకర్, యేదుపాటి రామయ్య తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ఓట్లు చీలనివ్వం : ఊదరగొండి చంద్రమౌళి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

మా భావాలకి, మా ఐడియాలజీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చాలా దగ్గరగా ఉందని రాబోవు ఎన్నికల్లో తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని నవ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఊదరగొండి చంద్రమౌళి అన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఊదరగొండి చంద్రమౌళి మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం, కుల నిర్మూలన, పేదరిక నిర్మూలన వంటివి మా పార్టీ సిద్ధాంతమన్నారు. పార్టీ ఏదైనా కావచ్చు అది ప్రతిపక్షం, పాలక పక్షం మరొక రాజకీయ పార్టీ కావచ్చు రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలన్నారు. బహుజనులకు రాజ్యాధికారం అనేవి ప్రధానమైనవి వాటిని అమలు చేస్తూన్న ఏ పార్టీ వాళ్లయినా తాము పూర్తి మద్దతు తెలుపుతామన్నారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ఈ విధంగా పేదలను ఆదుకున్నటువంటి దాఖలాలు లేవన్నారు. చిన్న వయస్కులు అయిన జగన్ మోహన్ రెడ్డి పేదలకు ఏం చేస్తే న్యాయం జరుగుతుందని, పేదరిక నిర్మూలన ఎలా చేస్తే బాగుంటుందో అనే ఉద్దేశ్యంతో నిత్యం వారి సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుపేదలకు, అగ్రకులాలలోని పేదలకు, రెండు లక్షల కోట్లకు పైగా ప్రభుత్వం ధనాన్ని నేరుగా లబ్ధిదారులు ఖాతాలోకి జమ చేసి అవినీతి రహిత పారదర్శక పాలన అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి రాకుండా టీడీపీ, జనసేన, ప్రయత్నాలు చేస్తున్నాయని, వారి ప్రయత్నాలు వమ్ము కాకతప్పదన్నారు. అందుకోసం తాము వైసీపీ ఓట్లు చీలనివ్వం అందుకోసం తాము కుడా రాష్ట్రంలో మెజార్టీ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ బెజవాడ రామారావు, నల్లి రాజేష్, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య వారోత్సవాలు

### -'స్కిజోఫ్రెనియా'పై అప్రమత్తం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

స్కిజోఫ్రెనియా వ్యాధిపై ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉండి చికిత్స పొందాలని మానస సైకియాట్రిక్ నర్సింగ్ హోమ్ అధినేత డా.ఆయోధ్య ఆర్.కె, చైల్డ్-ఎడల్డ్ సైకియాట్రిస్ట్ డా. మానస కాజ తెలిపారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం గాంధీనగర్లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్యంపై స్కిజోఫ్రెనియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈనెల 20వ తేదీ నుంచి 27 వరకు వారం రోజులపాటు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నిర్ణయించిందన్నారు. 24వ తేదీన ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య దినంగా గుర్తించబడిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 0.3 నుండి 0.7 శాతం ప్రజలు జీవిత కాలంలో స్కిజోఫ్రెనియా వ్యాధి పీడితులేనన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు నలుగురిలో కలవలేకపోవడం, పనిమీద ధ్యాస తగ్గిపోవడం, గొణుగుడు, ఒంటరి జీవితం, నాన్ ప్రొడక్టివ్‌గా తయారైపోతుంటారన్నారు. స్కిజోఫ్రెనియా వ్యాధితో బాధపడేవారికి "యాంటి సైకోటిక్స్" అనే మందులు వాడడం ఉత్తమమన్నారు. తొలుత వ్యాధి పట్ల రోగికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన (సైకో ఎడ్యుకేషన్). కల్పించాల్సి వుంటుందన్నారు. దీన్ని ఫ్యామిలీ కౌన్సిలింగ్ అంటారు. వ్యాధిగ్రస్తులు ఇన్ పేషెంట్గా ఉండి వ్యాధి కొంత నయం అయిన ఇంటికి తీసుకు వెళ్ళవచ్చు అన్నారు. అనంతరం ఇంటికి వెళ్ళి తరువాత బయాబెటిస్, బి. పి. వంటి దీర్ఘకాల మందులు ఏవిధంగా వాడుతుంటారో వీరికి కుడా అలానే వాడవలసి ఉంటుందన్నారు.

## రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో అమ్మ పార్టీ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

సమాజంలో, చట్టసభల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం లభిం చడం లేదన్నారు. మహిళా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా తమ పార్టీ ముందుకు సాగుతుందని అమ్మ పార్టీ జాతీయ జనరల్ సెక్రటరీ ఎస్.సుప్రవీణ తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో అమె మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లో మహిళా ప్రాతినిధ్యం సక్రమంగా లేదని, చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యం కోసం ఉద్యమిస్తామన్నారు. మా పార్టీ 20 సూత్రాల ప్రణాళికను అమలు చేస్తామన్నారు. పార్టీ వ్యవహారాల ఇన్చార్జి బివిన్ రాజు మాట్లాడుతూ విధులు, బాధ్యతలతో కూడిన హక్కులను ప్రజలకు అందించేందుకు అమ్మ పార్టీ 20 సూత్రాల ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, రానున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో మహిళా అభ్యర్థులనే పోటీ చేయిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ప్రస్తుత ప్రభుత్వ పాలనపై విసిగిపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పక్కన పెట్టి పంట దోపిడీ చేసి పరిగ ప్రజలకు పంచినట్లు పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని, అమ్మ పార్టీ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని అన్నారు. మహిళలు రాజకీయ ఉనికిని కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని, జనాభాలో సగ బాగంగా ఉన్న మహిళలకు చట్టసభల్లో 10 శాతం కూడా ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల పార్టీ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం పలు జిల్లాకు ప్రతినిధులను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎస్. సురేంద్రరెడ్డి, వప్పతొట్టి రమేష్, టి.యోహాను, పొట్లూరి కృష్ణారావు, బైర హనుమంతరావు, ఎసిడి రహమ తున్నీసా, ఎసిడి నురుద్దీన్, వప్పతోట్టి సుబాషిణి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

కానూరు అశోక్‌నగర్‌లోని యోగశక్తి సాధన సమితి ఆధ్వర్యంలో జూన్ ఒకటో తారీకు నుండి 21వ తారీకు వరకు ఉత్సవాలు నిర్వహించి యోగ విశిష్టలను ప్రజలకు తెలియ చెప్పాలని నిర్ణయించినట్లు యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్, డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు ,మెడ నొప్పి, జీర్ణ సమస్యలు, శ్వాస సమస్యలు మరియు డయాబెటిక్ లాంటి మహమ్మారిలను యోగ శక్తి విధానాలలో నయం చేసుకోవడానికి, ఆరోగ్య శిబిరాలు మరియు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21 రోజులపాటు జరుగు ఈ కార్యక్రమంలో పాల్గొనగోరు వారు సెల్ నెంబర్ 9000347369 కు తెలియజేసి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరడమైనది జూన్ 21వ తారీకు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశిష్ట కృషి చేసిన వారికి అవార్డుసు అందజేయనున్నట్లు చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు.

# విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్రంలో పిల్లలందరికీ అక్షరాస్యత మరియు సంఖ్యా పరిజ్ఞానం సాధించడం ఉపాధ్యాయుల తక్షణ కర్తవ్యం అని విద్యలో నైపుణ్యాలు సాధన కోసం ఉపాధ్యాయులందరూ విద్యాప్రగతికి బాటలు వేయాలని రాష్ట్ర విద్యాశాఖమాత్యులు బొత్స సత్యనారాయణ అన్నారు. 3 సంవత్సరాల నుంచి 9 సంవత్సరాల లోపు పిల్లలకు ఫౌండేషనల్ లిటరసీ మరియు న్యూమరసీలో భాగంగా 1, 2 తరగతులు భోదించు ఉపాధ్యాయులకు చిన్నారుల సంసిద్ధత కోసం 6 రోజులుగా విజయవాడ శివారు కానూరు మురళీరిసార్ట్స్‌లో నిర్వహిస్తున్నశిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖామాత్యులు బొత్స సత్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలతో మమేకమై ఆట, పాటలతో బోధన చేసినట్లయితే మనం ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు. నేర్చుకునే, నేర్పించే విధానంలో మన రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వ్యయప్రయాసలకోర్చి విద్యపై ఎంతో ఖర్చు చేసి దేశంలోనే అగ్రగామిగా నిలవగలిగిందన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో డిజిటల్ విద్యను అందించనున్నామని, దీనికోసం ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో విద్యా సంస్కరణలు చేపడుతున్నామన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ మాధ్యమంకంటే బోధనా విధానాలే ముఖ్యమని, చిత్తశుద్ధితో ఉపాధ్యాయులు పని చేస్తే మనం పిల్లల నుండి ఆశించిన విద్యాప్రమాణాలు సాధించవచ్చన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా శిక్షణాలో పాల్గొన్న రిసోర్సు పర్సన్లు తయారు చేసిన స్టాళ్లను తిలకించి ఉపాధ్యాయులను మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. అనంతరం 'జ్ఞాన ప్రకాశ్' శిక్షణా కరదీపికను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డా.బి.ప్రతాప్ రెడ్డి, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ పి.పార్వతి, జాయింట్ డైరెక్టర్ (టెట్) మేరి చంద్రిక, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బి.విజయ భాస్కర్, ప్రథమ్ సంస్థ ప్రతినిధి సునీత, కీ రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రజలు పోరాడితేనే ప్రజలకు రక్షణ అదే నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణ : గాంధీ నాగరాజన్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

మద్యపాన నిషేదమే స్త్రీకి రక్షణ కవచం, కుటుంబానికి రక్షణ కవచం, దేశానికి రక్షణ కవచమని గాంధీదేశం సోషల్‌వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీ నాగరాజన్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో సోమవారం రెండవ రోజు దండియాత్ర-2 రిలే నిరాహార నిరసన దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ ఎండకి నా గుండె కాలోచ్చు, మీ తుపాకి గుండుకి నా గుండెపేలొచ్చు, సత్యాగ్రహి అంటే భయపడేవాడు కాదు, భయపెట్టేవాడు కాదు, భయాన్ని పోగొట్టేవాడు సత్యంతో, అహింసతో పోరాడేవాడు గాంధేయవాది అని అన్నారు. రాజకీయ పార్టీలు చేసే పోరాటం ప్రజాస్వామ్యాన్ని రక్షించలేదు. పార్టీలకు అతీతంగా ప్రజలు పోరాడితేనే ప్రజలకు రక్షణ అదే నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణ. స్వార్థంతో బ్రతికేవాళ్ళు కొందరు దేశాన్ని దోచుకుంటారు. ఎమ్మెల్యే, ఎంపి, మంత్రులు, సిఎంలు, పీఎంలు, అధికారులు, రాజకీయనేతలు, వారి పరిపాలన విధానాలు కావచ్చు. ఇదే ఈనాటి మన ప్రజాస్వామ్యం. దీనికి బాధితులు సామాన్య మధ్య తరగతి ప్రజానీకం అందుకే మన కోసం మనమే పోరాడాలి. మన దేశం మన ప్రజలు మనదే సందేశం. అందుకే ప్రభుత్వ పాఠశాలలో, హాస్టల్స్, వృద్ధాశ్రమాలలో, ఆసుపత్రులలో నాసిరకం, నాణ్యతలేని బియ్యంతో భోజనాలను వ్యతిరేకించాలి. ఇలా వివిధ రూపాలలో బడుగు బలహీనవర్గాలు బలైపోకుండా కాపాడుకుంటేనే భావితరాలకు వారికి భవిష్యత్తు. అందుకే మన కోసం మనం పోరాడాలి. అందుకే నేను గాంధీ, నాలో అంబేద్కర్‌గా నేను చేస్తున్న ఈ సత్యాగ్రహ దీక్షలు దీన్ని జయప్రదం చేయవలసిందిగా ప్రజలకు నా సందేశం అని అన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు 'బంగారు' భారతి తదితరులు పాల్గొన్నారు.

## అవనిగడ్డ నుండి అరుణాచలం యాత్రకు వెళ్ళు భక్తులకు శుభవార్త

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ప్రతి నెల పౌర్ణమికి భక్తులకు అరుణాచల గిరిప్రదక్షిణ కోసం నడపబడుతున్న ఆర్టీసీ స్పెషల్ టూర్ బస్సు వచ్చే పౌర్ణమికి మరిన్ని పుణ్యక్షేత్రాలు అయిన అర్ధగిరి (ఆంజనేయ స్వామి గుడి), కంచి, విష్ణు కంచి, కామాక్షమ్మ గుడి, వామనుమూర్తి గుడి, బంగారు బల్లి దర్శనం, తిరుత్తుణి (సుబ్రమణ్య స్వామి గుడి)లు కలిపి దర్శించుకొనుటకు అదే చార్జీతో సౌకర్యం కల్పించడం జరిగినది. ఇంతకుముందు ప్రకటించిన విధంగా ఈ స్పెషల్ బస్సు జూన్ ఒకటవ తేదీన కాకుండా జూన్ రెండో తేదీ సాయంత్రం ఏడు గంటలకు బయలుదేరినట్లుగా మార్పు చేయడమైనది. కావున భక్తులు ఈ మార్పులు గమనించగలరు. అలాగే ఈ బస్సు రెండవ తేదీ సాయంత్రం ఏడు గంటలకు అవనిగడ్డ నందు బయలుదేరి కాణిపాకం జూన్ మూడో తేదీన 04.00 గంటలకు వెళ్లి అక్కడ ఫ్రెష్ అయ్యి కాణిపాకం విఘ్నేశ్వరుని దర్శనం చేసుకుని, తదుపరి అర్ధగిరి ఆంజనేయస్వామిని, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, అక్కడి నుండి సాయంత్రానికి అరుణాచలం చేరి, అరుణాచలం నందు మొదట దైవ దర్శనం చేసుకుని, తదుపరి గిరి ప్రదక్షణ చేసుకుని, జూన్ 4వ తేదీ అక్కడ నుండి కంచికి వెళ్లి కంచి నందు విష్ణు కంచి శివకంచి కంచికామాక్షమ్మ దేవాలయం, వామనమూర్తి గుడి, బంగారు బల్లి దర్శించుకుని తదుపరి తిరుత్తణి లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడికెళ్లి, ఆ తదుపరి కాళహస్తి దర్శించుకుని అవనిగడ్డ రావడం జరుగుతుంది. ఈసారి వెళ్ళు అరుణాచలం బస్సు సర్వీస్ నందు కలుగజేసిన ఈ మార్పులను, అదనపు దర్శనాలను గమనించగలరు. కావున ప్రయాణికులు, ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా మనవి చేయుచున్నాము. ఈ బస్సునకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్నది. సర్వీస్ రిజర్వేషన్ ఓపెన్ చేయబడినది. టికెట్లను ఆన్లైన్ నందు గానీ, ఎటిబి ఏజెంట్లు వద్దగాని, రిజర్వేషన్ కౌంటర్ వద్ద గాని పొందవచ్చును. రాను పోను బస్సు చార్జీ ?.3000/-లు. కావున ప్రయాణికులు జూన్ నెల రెండో తేదీ రాత్రి 7 గంటలకు బయలుదేరు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని వినియోగించుకొనవలసిందని డిపో మేనేజర్ కె.హనుమంతరావు ప్రకటనలో తెలిపారు. ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు +919493610699, +919963658630, +917674859427.

## ఎపికి ప్రత్యేక హోదా లేని ఎదుగుదల కలలో కూడా సాధ్యం కాదు : గాంధీ నాగరాజన్

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా లేని ఎదుగుదల కలలో కూడా సాధ్యం కాదని, ప్రత్యేక హోదా అంటే ప్రతి ఒక్కరి ప్రజల హోదా అనేది ఇంత వరకు ఏ నాయకుడు ఈ ప్రజలకి వివరించలేదని గాంధీదేశం సోషల్‌వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీ నాగరాజన్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ లోని ధర్నా చౌక్‌లో మూడవ రోజు దండియాత్ర-2 రిలే నిరాహార నిరసన దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజల కోసం పోరాడకుండా ఈ నాయకులు ప్రజల కోసం పోరాడే పరిస్థితి లేదన్నారు. పోరాడకుండా మనకి స్వాతంత్ర్యం పొందలేదన్నారు. పోరాడకుండా ఏ పార్టీలు పరిపాలనా విధానాన్ని అలంకరించలేదన్నారు. నేను చేస్తున్న దీక్ష ఈనాడు సాధారణ దీక్షగా భావించవచ్చు. సాధించగలిగే దీక్ష అనేది చరిత్రని అందరికీ నిరూపిస్తుంది. నేను మరణం చెందవచ్చు కాని చరిత్ర మీకు ఆ సందేశాన్ని భావితరాలకు అందిస్తుంది. మహాత్మాగాంధీని అతి దారుణంగా హత్యచేసిన 30వ తేదీన కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తూ వుంటానని తెలిపారు. ఢిల్లీ, తమిళనాడు, తెలంగాణ వివిధ రాష్ట్రాలంతా తిరుగుతూ వివిధ రూపాలలో ప్రచారం చేస్తూ అన్ని చోట్లా దీక్షలు చేయనున్నానన్నారు. దేశంలో అందరూ ఒక్కటే కొందరు ఎక్కువ, కొందరు తక్కువగా ఉండకూడదన్నారు. రాజకీయనాయకులు అందిన కాడికి దోచుకుంటున్నారు. ఉద్యోగస్తుల కడుపు కొట్టి, పేద ప్రజలకు ప్రాణాలు పిండేస్తున్నారన్నారు. వీటిని అరికట్టాలంటే మరో గాంధీ, అంబేద్కర్ పుట్టి రావాలంటే అయ్యే పనికాదు. పుట్టినవారే ఎవరైనా మారాలని సందేశమిస్తూ ఎపి, జెఎసి ఉద్యోగస్తులకి వాళ్ళ కుటుంబాలకి న్యాయం చూకూర్చాలని కోరుకుంటున్నానన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు 'బంగారు' భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై విడుదలైన రోజే ఇంట్లోనే కొత్త సినిమా వీక్షించే అవకాశం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



థియేటర్‌లో ఏరోజైతే సినిమా విడుదలై ప్రదర్శింపబడుతుందో అదే రోజున ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ప్రేక్షకులందరూ ఇంట్లో కూర్చొని వీక్షించేలా వినూత్న విధానం ప్రవేశపెట్టామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్ఎల్) ఛైర్మన్ డా.పి.గౌతమ్ రెడ్డి తెలిపారు. మంగళవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ మూడవ అంతస్థులో ఉన్న ఏపీఎస్‌ఎఫ్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సినిమా తీసే ప్రొడ్యూసర్‌కు, వీక్షించే ప్రేక్షకుడికి ఇరువురుకీ లాభం కలిగే విధంగా ఇకపై ఇంట్లోనే కొత్త సినిమా చూసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఫస్ట్ డే ఫస్ట్ షో అనే పద్ధతిలో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. 2 జూన్, 2023న విశాఖపట్నంలోని పార్క్ హోటల్ లో లాంఛనంగా ప్రారంభించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, వాణిజ్యం మరియు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. అదే విధంగా హీరో సాయి రోనార్క్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యులు సి.కళ్యాణ్, రమా సత్యనారాయణలు హాజరుకానున్నాం ˜న్నారు. ఏపీఎస్‌ఎఫ్ఎల్‌లో తొలుత నిరీక్షణ అనే సినిమాను ప్రదర్శిస్తామని తెలిపారు. ఏపీఎస్‌ఎఫ్ఎల్ ను కూడా ఒక థియేటర్‌లా భావించాలని గౌతమ్ రెడ్డి అన్నారు. రోజురోజుకి సినిమా అభిమానులు పెరుగుతున్న నేపథ్యంలో, ఓటీటీ లాంటి అనేక మాధ్యమాలు పుట్టుకొస్తున్న తరుణంలో రూ.99తో కొత్త సినిమా సబ్ స్క్రైబ్ చేసుకునేవారికి సినిమా వీక్షించే అవకాశం కల్పించామని దీని కాలపరిమితి సబ్ స్క్రైబ్ చేసుకున్న టైం నుండి 24 గంటల వరకూ ఉంటుందన్నారు. ఇది ఓటీటీ తరహాలో కాకుండా నేరుగా లైవ్ చూసే విధంగా రూపొందించామన్నారు. ఈ విధానం ఏ ఒక్క యాజమాన్యానికి గానీ, థియేటర్ ఓనర్స్‌కి గానీ, యాక్టర్స్‌కి గానీ ఏ రకమైన ఇబ్బంది కలిగించేది కాదని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా చెప్పిన మాట ప్రకారం, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకుందన్నారు.

# ముఖ్యమంత్రి గుడివాడ పర్యటనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలి !!

**గుడివాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుడివాడ పర్యటనను అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆనాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. త్వరలో కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం మధ్యాహ్నం ఆయన గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశమందిరంలో పలు శాఖల జిల్లా అధికారులతో సమావేశమై శాఖల వారీగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేయాలని టిడ్కో శాఖ తగిన ఫోటోలతో సమర్థవంతంగా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రవాణాశాఖ, ఆర్టీసీ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిటిఓ సీతాపతికి కలెక్టర్ సూచించారు. అలాగే వైద్య శిబిరాన్ని అంబులెన్స్ సదుపాయాన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో కల్పించాలని డిఎంహెచ్ ఓ డాక్టర్ గీతాబాయికి తెలిపారు. తొలుత ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ మంత్రులు, మచిలీపట్నం, గుడివాడ శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి వెంకటేశ్వరరావు (నాని), కలెక్టర్ పి.రాజాబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి మల్లాయపాలెంలోని టిడ్కో ప్లాట్ల వద్ద బహిరంగసభ ప్రదేశాన్ని సందర్శించి ముఖ్యమంత్రి సభా వేదికకు ఏ మేరకు అనుకూలంగా ఉందోనని పరిశీలించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్, జిల్లా ఎస్పీ పి.జాషువా, టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.చిన్నోడు, గుడివాడ ఆర్‌డిఒలు పద్మావతి, గుడివాడ మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ డిఆర్‌డిఎ పిడి, పి ఎస్ ఆర్ ప్రసాద్, హౌసింగ్ పిడి జీ.వి సూర్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.



# అమరావతిలో పేదలకు సీఎం జగన్ 'పట్టా'భిషేకం

**అమరావతి (వెంకటపాలెం), నేటి పత్రిక ప్రజావార్త :**

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 50,793 మంది నిరుపేద అక్కచెల్లెమ్మలకు సీఆర్డీఏ పరిధిలో కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. దీంతోపాటు ఇక్కడ నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్ల పత్రాలను సైతం లబ్దిదారులకు అందజేశారు. దీనిలో భాగంగా లబ్దిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ పరిధిలోని అమరావతిలో ఆర్ 5 జోన్ నందు పేదలకు మంజూరైనా ఇళ్ళ స్థలాల పట్టాల పంపిణీ చేశారు. సీఆర్‌డీఏ పరిధిలో పేద మహిళల పేరున లక్షలాది రూపాయల విలువ గల భూములలో ఇళ్ళ పట్టాలను కేటాయించడం సాధారణమైన విషయం కాదు. పేదలకు మంజూరు చేసిన లేఅవుట్ల వద్దకు వారం రోజులలో లబ్దిదారులను తీసుకుని వెళ్ళి ఆ ప్రాంతంలోనే జియో ట్యాగింగ్ చేసి పట్టాలను అందజేసి లబ్దిదారుల నుండి ఆప్షన్ తీసుకోనున్నారు. లేఅవుట్లలో నిర్మించే హౌసింగ్ కాలనీలలో గృహాలను నిర్మించుకునేందుకు లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన పేద మహిళల ముఖాలలో సంతోషం వెల్లివిరిసింది. ఇంతటి ప్రాముఖ్యమైన ప్రాంతంలో సొంత ఇళ్ళు నిర్మించుకుంటున్నామనే భావనతో ఒకింత విస్మయాన్ని వ్యక్తం చేస్తూ లబ్దిదారులు ఒకరికొకరు ఆనందాన్ని పంచుకుంటున్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని ఆర్ 5 జోన్ నందు 14 లేఅవుట్లలో ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 27,031 మంది మహిళల పేరున పట్టాలు మంజూరు చేయడం జరిగింది. ఇందులో బిసి వర్గానికి చెందిన 14,710, ఎస్సీ వర్గానికి చెందిన 2,334, ఎస్టీ వర్గాలకు చెందిన 409 మంది, ఇతర వర్గాలకు చెందిన 9,558 మంది లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయడం జరిగింది. అమరావతి ప్రాంతంలో ఇళ్ళపట్టాలను పంపిణీ పేదలకు అపూర్వమైన గౌరవం ఇవ్వడం చారిత్రాత్మకమైన సంఘటన.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ పేదల కోసం న్యాయ పోరాటం చేశాం.. విజయం సాధించాం.. ఇప్పుడు రూ. ఏడు లక్షల నుంచి 10 లక్షల విలువ చేసే ఇంటి స్థలం.. నా పేద అక్కచెల్లెమ్మల పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తున్నాం.. అమరావతి ఇక మీద సామాజిక అమరావతి అవుతుంది. మన అందరి అమరావతి అవుతుంది. దేశ చరిత్రలో ఈ కార్యక్రమానికి ఓ ప్రత్యేకత ఉంది. పేదలకు ఇళ్ల పట్టాలు వద్దని కోర్టులకెక్కి అడ్డుకున్నారు. పేదల కోసం సుప్రీంకోర్టులో ప్రభుత్వమే న్యాయపోరాటం చేసింది. ఇది పేదల విజయమని సీఎం జగన్ అభివర్ణించారు. ఇవి ఇళ్ల పట్టాలే కాదు.. సామాజిక, న్యాయ పత్రాలు కూడా. సామాజిక అమరావతే.. మనందరి అమరావతి. 50, 793 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తున్నాం. సీఆర్డీఏ పరిధిలో 1,402.58 ఎకరాల్లో మొత్తం 25 లేఅవుట్లలో ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. వారం పాటు ఇళ్ల పట్టాల పండుగ కార్యక్రమం ఉంటుందని, ఇళ్లు కట్టడానికి బీజం కూడా ఈ వారంలోనే పడుతుందన్నారు. అమరావతిలో 50,793 మంది పేదల దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా.. జులై 8వ తేదీన ఇళ్లు కట్టించే కార్యక్రమం చేపడతామన్నారు.

ఇల్లు కట్టుకోవాలంటే ఏ పద్ధతిలో కట్టుకుంటారోనని ప్రతి ఒక్కరికి మూడు ఆప్షన్లు ఉంటాయన్నారు. మొదటి ఆప్షన్.. ఎవరైనా సొంతంగా మేమే ఇల్లు కట్టుకుంటామని చెబితే దానికి అయ్యే ఖర్చు రూ.1.80 లక్షలు నేరుగా జమ చేస్తామని అన్నారు. రెండో ఆప్షన్ కూడా ఇస్తామని.. తమ ఇంటి నిర్మాణం చేయించుకోవడానికి వారికి కావాల్సిన నిర్మాణ సామాగ్రి ప్రభుత్వమే అందజేయాలని అని కోరితే..దానికి ప్రభుత్వమే సిద్ధమేనని. నిర్మాణ కూలీ మొత్తాన్ని పనుల పురోగతి మేరకు నేరుగా జమ చేస్తామని పేర్కొన్నారు. మూడో ఆప్షన్: మీరే ఏదో రకంగా ఇల్లు కట్టించమని అక్కచెల్లెమ్మలు అడిగితే.. దానికి కూడా చిరునవ్వుతో మీ అన్న సరే అంటున్నాడని ఎలా కట్టుకుంటారో మీరే ఆప్షన్ ఎంచుకోండని, ఇల్లు కట్టించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. ఈ ఇళ్లకు కూడా మిగతా చోట చేస్తున్నట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఇల్లు కడుతున్నామో అలాగే కట్టిస్తామని, ఇసుక పూర్తిగా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. సిమెంట్, స్టీల్, డోర్ ఫ్రేమ్‌లు ఇతర మెటీరియల్ ప్రభుత్వమే సబ్సిడీ రేటుకు, తక్కువ రేటుకు అందిస్తుందని, ప్రతి అక్కచెల్లెమ్మకు కూడా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. ఈ రోజు రాష్ట్రంలో క్లాస్ వార్ జరుగుతోంది. ఒక వైపు పేదవాడు, మరో వైపు పెత్తందార్లు ఉన్నారని, పేదవారికి ఇళ్ల స్థలాలు ఇస్తామంటే పెత్తందార్లు ఏకంగా కోర్టుల దాకా వెళ్లి అడ్డుకుంటున్నారని విమర్శించారు. నేరుగా నేను బటన్ నొక్కితే ఆ డబ్బులు మీ ఖాతాల్లోకే వెళు_న్నాయి, దీంతో మీ పిల్లలను హాయిగా చదివించుకుంటున్నారు.. ఇలాంటివి చేస్తుంటే.. దాన్ని కూడా అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు.






# 'కొబ్బరి నీళ్లు' కిడ్నీలో రాళ్లను నిజంగా దూరం చేయగలదా..??



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

కొబ్బరి నీరు తాగడం వల్ల చాలా అద్భుతమైన ప్రయోజనాలున్నాయని వైద్యులు అంటున్నారు. వివిధ వ్యాధులతో బాధపడేవారు దీనిని తింటారు. అయితే కిడ్నీని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో కొబ్బరి నీళ్లు కూడా మీకు సహాయపడతాయని మీకు తెలుసా? శరీరంలోని వ్యర్థాలను బయటకు తీయడానికి కిడ్నీ పనిచేస్తుంది. ఇది రక్తాన్ని శుభ్రంగా ఉంచడంలో మాత్రమే కాకుండా, శరీరంలోని అనేక ఎలక్ట్రోలైట్‌లను సమతుల్యం చేస్తుంది. కానీ కొన్నిసార్లు కొవ్వు, యూరియా మరియు ట్రైగ్లిజరైడ్స్ పేరుకుపోవడం వల్ల, మూత్రపిండాల పనితీరులో ఆటంకం ఏర్పడుతుంది. ఇది రక్తం గడ్డకట్టడం వంటి అనేక సమస్యలకు దారితీస్తుంది. ఆరోగ్య సంబంధిత సమస్యల నుండి బయటపడాలంటే, కిడ్నీని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుకోవడం అవసరం, ఈ పనిలో మీకు ఎవరైనా సహాయం చేయగలిగితే.. అది 'కొబ్బరి నీరు'. నిజానికి, కిడ్నీలను శుభ్రంగా ఉంచుకోవడానికి కొబ్బరి నీళ్లను మించిన మంచి ఆప్షన్ లేదు మరియు ఇది సైన్స్ కూడా అంగీకరించింది. సైన్స్ ప్రకారం, మూత్రపిండాల పనితీరును మెరుగుపరచడానికి మీరు ప్రతిరోజూ కొబ్బరి నీటిని తీసుకోవాలి. కొబ్బరి నీరు మూత్రంలో క్లోరైడ్, సిట్రేట్ మరియు పొటాషియం విసర్జనను ప్రోత్సహిస్తుంది. అవి శరీరంలో పేరుకుపోకుండా నిరోధిస్తుంది. కొబ్బరి నీరు క్రియాటినిన్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీరు విటమిన్ సి మంచి మూలం కాబట్టి, ఇది క్రియాటినిన్ స్థాయిని తగ్గిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తుంది. కొబ్బరి నీళ్లలో కూడా పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది మూత్రపిండాలలో రక్త ప్రసరణను మెరుగ్గా నిర్వహించడానికి, దాని సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

## కలిసికట్టుగా విద్యావ్యవస్థను మెరుగుపరుద్దాం

**- రాష్ట్ర విద్యాశాఖామాత్యులు బొత్స సత్యనారాయణ**

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**




రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచీ విద్యా వైద్యానికి తొలి ప్రాధాన్యమిస్తుందని, విద్యాపరంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే మొట్టమొదటిసారిగా అమలు చేయడంలో ముందు ఉందని రాష్ట్ర విద్యా శాఖామాత్యులు బొత్స సత్య నారాయణ అన్నారు. శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఆంధ్రాలయోలా కళాశాలు వేదికగా జరిగిన 'డిజిటల్ విద్యావిధానం-సాంకేతికత తో కూడిన బోధన మరియు అభ్యాసం'పై జిల్లా జట్లకు జరిగిన అవగాహన కార్యక్రమంలో వేర్వేరు సమయాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచమంతా ఎదురు చూస్తున్న డిజిటల్ ఎడ్యుకేషన్ బాటలో మన రాష్ట్రం ముందుండాలని ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి తలచారని అన్నారు. పుట్టిన బిడ్డ అమ్మఒడిలోనే అమ్మా అనే మాట ఎలా నేర్చుకుంటారో అలానే పునాది స్థాయి నుంచే పిల్లలను తీర్చిదిద్దాలనే ఆశయంతో ప్రణాళికబద్ధంగా అధికారులను ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగా ఈ సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. గత మూడు నాలుగేళ్లలో 'మన బడి: నాడు-నేడు' ద్వారా ప్రభుత్వ బడులను ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి విద్యార్థికి సొంత బిడ్డలకు ఎలాంటి విద్యను అందించాలనుకుంటున్నామో ప్రభుత్వం ఈ పథకాల కోసం ఖర్చు చేస్తుందంటే సంక్షేమానికి కాదు... విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడి అని పేర్కొన్నారు. అన్ని ప్రీ-హై స్కూల్లు, హైస్కూల్లు, హైస్కూల్ ప్లస్‌లలో 6 నుండి 10 తరగతుల వరకు ప్రతి విభాగానికి 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఫౌండేషనల్, ఫౌండేషనల్ ప్లస్ పాఠశాలలకు 10,038 స్మార్ట్ టీవీలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న జిల్లా స్థాయి రిసోర్సు పర్సన్లు ప్రతి పాఠశాలలో డిజిటల్ విద్యావిధానం చక్కగా బోధించేలా తర్ఫీదునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, పాఠశాల విద్యా కమీషనర్ (ఇన్ఫ్రా) కాటమనేని భాస్కర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డా. బి.ప్రతాప్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ (సర్వీసులు) మువ్వా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# రోహిణి కార్తె ప్రారంభం

**- రోహిణి కార్తె అంటే ఏంటీ ? - ఎండలు ఎందుకు ఎక్కువగా ఉంటాయి ?**




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

రోహిణి కార్తె వచ్చింది అంటే వామ్మో రోహిణి కార్తెలో ఎండలకు రోకండ్లు పగిలే ఎండలు ఉంటాయి అనే నానుడి మనలో మెదలాడుతూ ఉంటుంది. నిజమే మరి ఈ నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తోలి రోజులలో కొద్ది కొద్దికగా ఉగాది నుండి తాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని మనకు చూపిస్తాడు. మామూలుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. మరి ఈ సంవత్సరం రోహిణి కార్తె ఏలా ఉంటుందో గమనిద్దాం. తేదీ. ఈ సంవత్సరం రోహిణి కార్తే మే 25 న ప్రారంభమై జూన్ 8 వరకు రోహిణి కార్తె ఉంటుంది. రోహిణి కార్తె ఫలితంగా ఈ పక్షం రోజులు అధిక వేడి గాలులు, ఎండ తీవ్రతలు, అగ్ని ప్రమాదాలు, ఉక్కపోతలు ఉంటాయి.

ఎండ తీవ్రతకు శరీరం అలసిపోతుంది. కావునా ఆరోగ్య రీత్య తగు శ్రద్దలు తీసుకోవాలి. ఎక్కువ మట్టికుండ నీళ్ళు త్రాగడం, మజ్జిగా, పండ్ల రసాలు, కొబ్బరినీళ్ళు, నిమ్మరసం, రాగి జావ, ఫలుదా లాంటివి ఎక్కువగా త్రాగడం వలన ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది కొంత ఉపశమనం లభిస్తుంది. మసాలాకు సంబంధించిన ఆహార పదార్థాలు, వేపుళ్ళు, పచ్చళ్ళు, ఎక్కువ ఆయిల్ ఫుడ్ కలిగిన ఆహార పదార్థాలు తినకూడదు.

నీళ్ళ సౌకర్యం ఉన్నవారు తప్పకుండా రెండు పూటల స్నానం చేయండి. అన్నిరకాల వయస్సు వారు ఎక్కువ కాటన్ దుస్తులు వాడండి, తెల్లని రంగు కల్గినవి, తేలిక రంగులు గల కాటన్ బట్టలు ధరిస్తే ఉష్ణ తాపం నుండి ఉపశమనం లభిస్తుంది. శారీరక తాపం తగ్గుతుంది. చిన్నపిల్లలకు మీరు ఉండే ఇంటి ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి తడి గుడ్డతో తుడిచి బట్టలు మార్చండి. ఎవరైనా సరే ముదురు రంగు దుస్తులు వేయకపోవడం ఉత్తమం.

ముఖ్యంగా సాటి జీవులైన పశు, పక్ష్యాదులకు త్రాగడానికి మీరు నివసించే చోట వాటికి నీళ్ళను ఏర్పాటు చేయండి. బాటసారులు ఎవరైనా సరే వాళ్ళు అడగక పోయిన వాళ్ళ దాహాన్ని తీర్చేందుకు వారికి త్రాగడానికి చల్లటి నీళ్ళను అందివ్వండి. ఇలాంటి సంఘ సేవా కార్యక్రమాలు చేయడం వలన మీకున్న గ్రహభాదలు నివారణకు మార్గమై కొంత ఉపశమనం లభిస్తుంది. అంతే కాకుండా మీకు మీ కుటుంబ సభ్యులకు ఎంతో పుణ్యఫలం దక్కి అంతా మంచి జరుగుతుంది.

## ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇంటర్ అర్హతతో మీడియా కోర్సులు

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాది జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ విభాగంలో సరికొత్త కోర్సులను ప్రవేశ పెట్టింది. సమాజంలో రోజురోజుకు మీడియా రంగంలో వినూత్న కోర్సులు అవిర్భవిస్తున్న తరుణంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కూడా మీడియా కోర్సులను ప్రవేశపెట్టింది. 20ఏళ్ల క్రితం ప్రారంభించిన ఎంఏ జర్నలిజం కోర్సు దినదినాభివృద్ధి చెంది నూరుశాతం ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కలిగి ఉంది. ఈక్రమంలో మీడియా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి నూతన కోర్సులను, పార్ట్ టర్మ్ కోర్సులను వర్సిటీప్రారంభించింది. డిప్లమో, సర్టిఫికెట్ విధానంలో కోర్సులను తీసుకువచ్చింది. ఇంటర్మీడియేట్ అర్హతతో ఈ ప్రవేశాలు కల్పించనున్నారు.

**కోర్సుల వివరాలు**

డిప్లమో ఇన్ ఫిల్మ్ మేకింగ్, డిప్లమో ఇన్ ఫోటోగ్రఫీ, డిప్లమో ఇన్ ఫిల్మ్ డైరెక్టర్, డిప్లమో ఇన్ : యాక్టింగ్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ స్టోరీ అండ్ స్క్రిప్ట్ రైటింగ్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ సినిమాటోగ్రఫీ, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ షార్ట్ ఫిల్మ్ ప్రొడ క్షన్, డాక్యుమెంటరీ, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫిల్మ్ అప్రిసియేషన్ కోర్సులను ప్రారంభిం చింది. డిప్లమో కోర్సులు ఏడాది కాలంలో, సర్టిఫికెట్ కోర్సులు 6 నెలల కాలంతో నిర్వహి స్తారు. ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ డైరెక్టర్, యాక్టింగ్ కోర్సులకు రూ.30వేలు, స్టోరీ అండ్ స్క్రిప్ట్ రైటింగ్, సినిమాటో గ్రఫీ, షార్ట్ ఫిల్మ్ ప్రొడక్షన్, డాక్యుమెంటరీ కోర్సులకు రూ.20 వేలు, ఫోటోగ్రఫీ, ఫిల్మ్ అప్రిసియేషన్ కోర్సులకు రూ.10 వేలు చొప్పున ఫీజులను నిర్ణయించారు.వీటితో పాటు దరఖాస్తుకు, ప్రాసెసింగ్‌కి వెయ్యి చొప్పున, మెడికల్ ఫండ్ కింద రూ.240 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులను జూన్ 14వ తేదీలోగా సమర్పించాలి. రూ.500 ఫైన్ అదే నెల 24వ తేదీ వరకు సమర్పించుకునే అవకాశం కల్పించినట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత పేర్కొన్నారు.

# పరస్పర సహకారానికి సిద్ధం

**- జర్మన్ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్‌తో మంత్రి రజిని ప్రత్యేక భేటీ**

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్రపదేశ్ రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని భారత్‌లో జర్మన్ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్ తెలిపారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లో ఉన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం జర్మన్ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్‌తో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాన్సుల్ జనరల్ కుచ్లర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థుల పరస్పర మార్పిడి, వైద్య పరిశోధనలో పరస్పర సహకారానికి తాము సిద్ధంగా ఉన్నామని, ఆ మేరకు ఎంవోయూలు కుదుర్చుకుందామని ప్రతిపాదించారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఉన్న అవకాశాలను తమతో చర్చిస్తే.. ఆ మేరకు కలిసి ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. కోవిడ్ సమయంలో భారతదేశం అందించిన తోడ్పాటుకు జర్మనీ ఎప్పుడూ రుణపడి ఉంటుందని తెలిపారు. యాంటీబయాటిక్, సర్జికల్ వస్తువులను ఆ సమయంలో భారతదేశం నుంచి తొలిసారి దిగుమతి చేసుకున్నామని, ఇప్పటికీ ఈ దిగుమతులు కొనసాగుతున్నాయని వివరించారు. యోగా, ఆయుర్వేదం లాంటి సాంస్కృతిక వైద్య విధానాలను తమ దేశంలోనూ అమలు జరిపేలా, మా వైద్య విధానాలను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చేలా అవగాహన ఒప్పందం కుదర్చుకునేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు.

తమ రాష్ట్రంలోని విశాఖపట్టణంలో అద్భుతమైన వనరులతో మెడ్‌టెక్ జోన్ ఉందని, జర్మన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడితే ఇరుదేశాలకు మేలు చేకూరుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. తమ రాష్ట్రంలోని నర్సింగ్ విద్యార్థులు వృత్తి నిర్వహణ కోసం జర్మనీ వెళ్లేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని, ఈ విషయంలో జర్మనీ దేశ సహకారం కావాలని కోరారు. తమ రాష్ట్రంలో వైద్య పరిశోధనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీలో వైద్య పరిశోధనకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు. జర్మనీ దేశ సాంకేతిక సహకారం కూడా తోడైతే వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. జర్మనీలో వైద్య రంగంలో మానవ వనరుల కొరత ఉందని, దాన్ని అధిగమించేందుకు భారత్ సహకారం తీసుకుంటామని జర్మన్ కాన్సుల్ జనరల్ కుచ్లర్ మంత్రి విడదల రజినితో అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కసారిగా అక్షరాస్యత పెరిగినట్లుగా తాము గుర్తించామని, ఇదెలా సాధ్యమైందని మంత్రిని కాన్సుల్ జనరల్ కుచ్లర్ అడిగారు. మంత్రి మాట్లాడుతూ విద్యారంగంలో తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, ఆ ఫలితంగానే అక్షరాస్యత అనూహ్యంగా పెరిగిందని మంత్రి తెలిపారు. ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ ప్రోగ్రాం తమ రాష్ట్రంలో అమలవుతున్నదని చెప్పారు. జర్మనీలో వైద్య సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో పదివేల మంది నర్సులను జర్మనీకి సేవలు అందించేందుకు పంపాలన్నా తమ వద్ద సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అవసరమైన సహకారం అందిస్తే చాలని వెల్లడించారు. భేటీలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంఈ డాక్టర్ నర్సింహం, జర్మన్ రాయబార కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-5 Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri999@gmail.com